

మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



'ప్రాణీ అప్ నే ప్రభూ సే పూఛే కిస్ విధీ పావూ తోహే

ప్రభు కహే తూ మన్‌కో పాలే, పాజాయేగా మోహె.

'ప్రాణి ' ప్రభువును'నిన్ను చేరే మార్గమేది? ఏ రకంగా నిన్ను పొందగలను?' అని అడిగింది. దానికి సమాధానంగా ప్రభువు 'నువ్వు నీ మనస్సును అదుపులో ఉంచుకో. నన్ను పొందుతావు' అన్నాడు.

'కాజల్' సినిమా ఆరంభంలో పేర్లు వచ్చేప్పుడే వినిపిస్తుందీ సాకీ. సినిమా కథా సారాన్ని ముఖ్యంగా ప్రధాన పాత్ర వ్యక్తిత్వాన్ని రెండు పాదాలలో వివరిస్తుంది.

తొర మన్ దర్పణ్ కహలాయే

భలే బురే సారే కర్మోంకో దేఖే ఔర్ దిఖాయే

ఒకప్పుడు హిందీ సినిమాలలో నాయకలు దైవభక్తి కలవారయి ఉండేవారు. ధర్మపాలనా బద్ధులై ఉండేవారు. నైతిక విలువల పాలన కంకణబద్ధులై ఉండేవారు. మంచి, చెడుల నడుమ తేడా తెలిసిన విచక్షణాపరులై ఉండేవారు. వారి వ్యక్తిత్వాన్ని ప్రేక్షకులకు తెలిపేందుకు, సినిమా ఆరంభంలోనే, నాయిక పరిచయం భక్తిగీతంతో అయ్యేది. ఉదయం నిద్రలేవగానే భక్తిగా భగవంతుడి కీర్తనతో మిగతా అందరినీ నిద్రలేపేది నాయిక. ఆ భజనతో నాయిక ఏమిటో? ఎలాంటిదో? అందరికీ తెలిసిపోయేది.

'కాజల్' సినిమాలో, అలా నాయిక వ్యక్తిత్వాన్ని పరిచయం చేసేపాట ఇది. ఆ కాలంలో ఇలాంటి భక్తి గీతాల ద్వారా సమాజంలో సామాన్యులకు సైతం వేదాంత సారాన్ని చేరవేసేవారు. మంచి మార్గాన్ని చూపేవారు. మంచికి చెడుకు

నడుమ తేడాను తెలుపుతూ భక్తి, మార్గం బోధించేవారు. ఇలాంటి పాటలు 'భజన గీతాలై' ఈనాటికీ వినే వారికి వేదాంతం, విచక్షణ, ఉత్తమ ఆలోచనా విధానం, ఉన్నత భావనలను బోధిస్తున్నాయి.

ఈ పాట రాసింది సాహిర్ లూధియాన్వీ.

సాహిర్ లూధియాన్వీ వామ పక్షభావ ప్రభావితుడు. దైవాన్ని మతాన్ని ఒప్పుకోడు. జీవితం అనుభవించటానికే తప్ప, ఏడుస్తూ కూర్చోవటానికి కాదని తన ప్రతి పాటలో బోధిస్తాడు. అలాగే జీవించాడు. ఆయన రాసిన భజన గీతం ఇది. అందుకే పాటలో ఎక్కడా దైవం ప్రసక్తి రాదు. భారతీయ తత్వాన్ని ఎంతో లోతుగా అర్థం చేసుకున్న కవి సాహిర్. భారతీయ ధర్మంలో 'దైవ' భావన తప్పని సరి కాదు. దైవాన్ని నమ్మనివాడు కూడా ధర్మానుయాయి కావచ్చు. అతనితో దైవాన్ని నమ్మేవారికి ఎలాంటి వివాదం లేదు. అది ఈ పాట నిరూపిస్తుంది. దైవాన్ని నమ్మకున్నా ధర్మాన్ని, నీతినీ, నిజాయితీని నమ్మితే చాలు. అతడు భక్తుడే. భారతీయ ధర్మం అతడిని తనలో ఒకడిని చేసుకుంటుంది.

పాట ఆరంభంలోనే 'మనసును నియంత్రణలో ఉంచుకుంటే నీకు నేను కనిపిస్తాన'ని భగవంతుడు చెప్పటం కనిపిస్తుంది.

విద్యా హి కా బ్రహ్మగతి ప్రదా వా బోధో హి కోయస్తు విముక్తి హేతు:!

కోలాభ ఆత్మవగమో హియో వై జితం జగత్కేన మనోహియేన॥

బ్రహ్మగతికి మార్గం చూపేదే విద్య. విముక్తికి కారణమయ్యేదే జ్ఞానం. ఆత్మను గ్రహించేదే జ్ఞానం. ప్రపంచాన్ని జయించేది మనసును జయించినవారే.

ఇది తత్వం. మనసును నియంత్రించిన వారే ప్రపంచాన్ని గెలుస్తారు. ప్రపంచాన్ని గెలవటమంటే కత్తితో గెలవటం కాదు. ధనంతో కొనటం కాదు. ప్రపంచాన్ని గెలవటం అంటే ప్రపంచంలోని సుఖదుఃఖాలకతీతంగా, అసూయ ద్వేషారహితంగా, నిర్మలంగా, నిర్మోహమాటంగా, నిశ్చింతగా, ప్రశాంతంగా నిత్యానందం అనుభవిస్తూంటాడని అర్థం. అలా నిరంతరానంద స్రవంతిలో స్నానమాడుతూండాలంటే మనస్సుపై నియంత్రణ సాధించాలి. మనస్సే భగవంతుడిని గ్రహించేందుకు దారి చూపిస్తుంది, ఎప్పుడైతే నియంత్రణలో ఉంటుందో. అందుకే మనస్సుపై నియంత్రణ సాధించటం అత్యంత అవశ్యకం అని భారతీయ తాత్విక గ్రంథాలన్నీ నొక్కి చెప్తాయి.

దానం పూజా తపశ్చైవ తీర్థసేవా శృతం తథా!

సర్వమేవ వృధా తస్య యస్య శుద్ధం న మానసం॥

మనస్సు శుద్ధంగా లేకపోతే దానం, పూజ, తపస్సు, తీర్థయాత్రలు, ప్రవచనాలు వినటం అంతా వ్యర్థం.

ఇదీ మనస్సుపై నియంత్రణ ప్రాధాన్యం. అందుకే పాట ఆరంభంలోనే 'తూ మన్ కో పాలే' అని అన్నాడు భగవంతుడు అని చెప్పాడు కవి.

పాట పల్లవిలో మనస్సును 'సాక్షి' అన్నాడు. మనస్సు దర్పణంలాంటిది. మనిషి చేసే మంచి, చెడు కర్మలను చూస్తుంది, చూపిస్తుంది! భారతీయ తత్వసారాన్ని పిండి, మధుర రసాన్ని అందించాడు సాహిర్.

భారతీయ ధర్మంలో మనస్సు 'సాక్షి'. మంచి చెడులు చూడటమే కాదు. మనసుని హెచ్చరిస్తుంది. నేరం చేసి ప్రపంచం నుంచి తప్పించుకోవచ్చు. కానీ 'మనస్సు' నుంచి తప్పించుకోలేము. ఎందుకంటే మనస్సు నుంచి ఏదీ దాచలేము. మనల్ని మనం ఎంత మభ్యపెట్టుకున్నా మన మనస్సును మభ్య పెట్టడం కుదరదు. అందుకే ఈ పాటలో ఒక చరణం చివర్లో అంటాడు సాహిర్ 'జగ్ సె చాహే భాగ్ లే కోయీ, మన్ సె భాగ్ న పాయే'. ప్రపంచం నుంచి పారిపోవచ్చుకానీ మనస్సునుంచి పారిపోవటం కుదరదు. ఎందుకంటే మనస్సు దర్పణం లాంటిది.

బంధన్ తొడా జా సక్తా హై

జగ్ కో ఛోడా జా సక్తా హై

అప్‌నే అప్ సె భాగ్ రహేహో

తుం హో కిత్నే భోలే

దర్పణ్ ఝూట్‌న బోలే

'దర్పణ్' సినిమాలో ఆనంద్ బక్షీ రాయగా మన్నాడే పాడినది ఈ పాట. బంధాన్ని వదిలించుకోవచ్చు, ప్రపంచాన్ని వదిలేయవచ్చు. కానీ తన నుంచి తాను దూరం పారిపోవాలనుకోవటం అమాయకత్వం. ఎందుకంటే అద్దం అబద్దం చెప్పదు. ఆ అద్దం మనస్సు.

ముఖ్‌డా దేఖ్ లే ప్రాణీ, జరా దర్పణ్ మే

దేఖ్‌లో కిత్‌నా పుణ్య్ హై కిత్‌నా

పాప్ తేరే జీవన్ మే

'దో బహెన్' సినిమాలో కవి ప్రదీప్ రాసిన పాట ఇది. దర్పణంలో ముఖం చూసుకో ప్రాణీ. నీ జీవితం లో ఎంత పుణ్యం ఉందో, ఎంత పాపం ఉందో చూసుకో అంటున్నాడు. అద్దంలో మన ముఖం కనిపిస్తుంది. పాపం పుణ్యాలు చూసుకోవాలంటే మామూలు అద్దం సరిపోదు. అక్కడ కావాల్సింది అద్దంలాంటి మనస్సు. మనస్సు అద్దంలో మన మంచీ చెడు మనకు కనిపిస్తాయి.

భారతీయ ధర్మం ప్రధానంగా తర్కంపై ఆధారపడింది. మంచి, చేసినప్పుడు సంతోషింప చేసి చెడు చేసినపుడు భయాన్ని, బాధను కలిగించేది ఏది? దాన్ని అనుభవించేది ఏది? అని తర్కించి మనిషి మనస్సులో 'సాక్షి' ఉన్నాడని తీర్మానించింది.

అహంకారమతేర్దృష్టా సర్వక్షేత్రేషు సర్వదా!

అహంకార కృతాంభావాంబుద్ధేర్వృత్తీశ్చ సర్వతః!

జానాతి ప్రత్యగల్మాత్మా పురుషోయం స్వభావత్.॥

ఇది 'వివేక చూడామణి 'లో ఆదిశంకరులు 'అహం' నుంచి 'మనస్సు'ను వేరు చేసి చూపిన శ్లోకం.

అహంకారాన్ని, బుద్ధిని, సర్వకాల సర్వావస్థలలో దర్శించి, ఈ ప్రపంచమంతా అహంకారం, బుద్ధి సృజన అని గ్రహించే సాక్షి, మనస్సులో ఉండే పురుషుడు. అతడే సాక్షి. 'తోర మన్ దర్పణ్ కహలాయే, భలే బురే సారే కర్మంకో దేఖే

ఔర్ దిఖాయే' అని సాహిర్ రాసిన పల్లవికి టూకీగా నేపధ్యం ఇది. ఇంకా లోతుగా వెళ్తే అది ఓ పుస్తకం అవుతుంది. ఎంతో లోతైన భావాన్ని అతి సరళంగా, సులభమైన పదాలలో ప్రదర్శించాడు సాహిర్.

మన్ హి దేవతా, మన్ హీ ఈశ్వర్, మన్ సే బడా న కోయ్

మన్ ఉజియారా జబ్ జబ్ ఫైలే. జగ్ ఉజియారా హోయ్

ఇస్ ఉజ్‌లే దర్పణ్ పే ప్రాణీ, ధూల్ న జమ్ నే పాయే...

ప్రపంచానికి సాక్షి 'సూర్యుడు'. సూర్యుడు చూడనిది లేదు. సూర్యుడికి ఎలాంటి మలినాలు అంటవు. అలాగే మనస్సు. మంచి చెడు చూస్తుంది. చెప్తుంది. కానీ, మనస్సునే దర్పణంపై మలినాలు చేరతాయి. మలినాలు అజ్ఞానం. జ్ఞానం వెలుగు. మనస్సులో జ్యోతి ఎప్పుడెప్పుడు విస్తరిస్తుందో, అప్పుడు ప్రపంచం కూడా వెలుగుమయం అవుతుంది. వెలుగు అంటే విజ్ఞానం. మనస్సు జ్ఞానంతో నిండటం అంటే సత్యాన్ని గ్రహించటం. ఎప్పుడైతే తన మనసే ఈశ్వరుడని మనిషి గ్రహిస్తాడో, అతడికి విశ్వమంతా ఈశ్వరమయం అవుతుంది. విశ్వమంతా ఈశ్వరమయం అయినప్పుడు ఇందులో పొందేది ఏది? పోయేది ఏది? కోల్పోయేది ఏది? కోరేది ఏది?

ఈశావాస్య మిదం సర్వం యత్ కించ జగత్యాం జగత్!

తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్యస్విద్ ధనం॥

'ఈశావాస్యోపనిషత్తు' ఆరంభ మంత్రం ఇది. ఈ విశ్వం సర్వం ఈశ్వరుడే. దీన్లో ఇందులో నీ స్వంతమైనదేముంది? కాబట్టి దేన్నీ ఆశించకుండా, సర్వం త్యజించి జీవితాన్ని ఆనందంగా జీవించు. ఇందులో అంతా భగవంతుడిదే అయినప్పుడు ఇందులో తనదేది? తనది కానిదేది? మనస్సే ఈశ్వరుడయినప్పుడు, ప్రపంచమంతా ఈశ్వరుడే అయినప్పుడు.. ఇక ప్రపంచంలో మనదేముంది? మనది కానిదేముంది? దేని కోసం ఆశ? దేనికోసం ఆరాటం?

అయితే ఈ భావన మనోదర్పణం శుభ్రంగా, ఎలాంటి మలినాలు లేనప్పుడు మాత్రమే కలుగుతుంది. అద్దం శుభ్రంగా ఉంటేనే ప్రతిబింబం స్పష్టంగా ఉంటుంది అద్దంపై మలినాలు అలముకుంటే ప్రతిబింబం స్పష్టంగా ఉండదు. సత్యం స్పష్టంగా కనబడదు. కాబట్టి అబద్ధాన్ని సత్యం అనుకుని మనస్సు పొరబడుతుంది. అందుకని అద్దాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. అహంకారం, అసూయ, కామం, క్రోధం, లోభం, ద్వేషం, వంటి మలినాలు అద్దంపై చేరకుండా

చూసుకోవాలి. మనస్సును శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పటమే కాదు, శుభ్రంగా ఉంచుకునే మార్గం కూడా భారతీయ ధర్మం సూచించింది.

చేతోదర్పణ మార్జనం భవమహాదావాగ్ని నిర్వాహణం!

శ్రేయః కైరవ చంద్రికా వితరణం విద్యావధూ జీవనం॥

భగవన్నామ జపం, తపస్సు వంటివి మనస్సు అద్దాన్ని శుభ్రపరుస్తాయి. దహిస్తున్న భౌతిక జీవితాగ్నిని చల్లబరచి, ఆధ్యాత్మక శీతల చంద్ర కిరణాలను ప్రసరింపచేస్తాయి.

మనస్సును శుభ్రంగా ఉంచుకుని మలినాలు అంటకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిరంతరం భగవన్నామ జపం, ధ్యానం, తపస్సు వంటివి. అవి లేకపోతే మనోదర్పణం మలినమయం అవుతుంది. దాని ఫలితాలు. మనం చుట్టూ చూస్తున్నాం. చిత్తశుద్ధిలేని జపం, మననం మరింత ప్రమాదకరమైనవి. అవి వ్యక్తినే కాదు, వ్యవస్థనూ దెబ్బతీస్తాయి. మలినాలంటిన తరువాత శుభ్రపరచే బదులు, మలినాలు అంటకుండా ముందే జాగ్రత్త పడటం శ్రేయస్కరం. అదే చెప్తున్నాడు సాహిర్.

సుఖ్ కీ కలియా, దుఖ్ కే కాంటే, మన్ సబ్‌కా ఆధార్

మన్ సే కోయీ బాత్ ఛుపేనా, మన్ కే నైన్ హజార్

జగ్‌సే కోయీ భాగ్‌లే కోయీ, మన్ సే భాగ్ న పాయే...

సుఖం పూలు, దుఃఖం ముళ్లు అన్నింటికీ ఆధారం మనస్సే. మనస్సునుంచి ఏదీ దాచలేము. దానికి వెయ్యి కళ్లు. ప్రపంచం నుంచి పారిపోవచ్చేమోకానీ మనస్సు నుంచి ఎవ్వరూ పారిపోలేరు.

మన్ ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:!

బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం॥

మనుషుల బంధనాలకూ, విముక్తికీ కారణం మనస్సే. భౌతిక విషయాసక్తి బంధనాలకు కారణం. బంధనాలకు దూరంగా ఉన్నప్పుడు విముక్తి.

ఈ ప్రపంచం అంతా మనస్సు ఆడించే ఆట అంటారు. బంధాలు ఉన్నాయనుకుంటే ఉంటాయి. లేవనుకుంటే లేవు. మానవ బంధనాలలో, విముక్తిలో మనస్సు పోషించే ప్రధాన పాత్రను పలు ఉదాహరణలతో వివరిస్తుంది భారతీయ తత్వం.

మానవ శరీరం రథం. ఆత్మ రథి. బుద్ధి/ మనస్సు సారథి. ఇంద్రియాలు కళ్లాలు. కళ్లాలను పట్టి ఉంచితే రథం సవ్యంగా నడిచి గమ్యం చేరుతుంది. లేకపోతే, అది ఇష్టం వచ్చినట్టు పరుగెత్తి బోర్లా పడుతుంది. గమ్యం చేరదు.

ఈ ఉదాహరణ సరిపోదన్నట్టు ఒకే చెట్టుపై రెండు చిలకలున్నాయి. ఒకటి సంసార ఫలాలను తింటూ ఆనందిస్తున్నది. మరొకటి నిర్మోహంగా చూస్తున్నది, అన్న ఉదాహరణ కూడా ఉంది. సంసార ఫలాలు తినేది సుఖదుఃఖాలు అనుభవిస్తూ జనన మరణ పరంపరలను అనుభవిస్తూంటుంది. లేనిది స్వేచ్ఛగా ఉంటుంది. ముక్తిని పొందుతుంది. ఈ సత్యాన్ని వివరించారు. ఈ సత్యాన్ని మరింతగా శ్రేయస్సు, ప్రేయస్సు ద్వారా వివరించారు. ప్రేయస్సు అన్నది సంసార సుఖాలు అనుభవించేది. అది జనన మరణ చక్రం. శ్రేయస్సు అంటే ఆధ్యాత్మకం. మోహాలకు దూరమైన నిర్మోహి. అది శాశ్వతానందం అనుభవానికి దారి. 'మనస్సుపై నియంత్రణ సాధించిన మనిషి శ్రేయస్సు కోరతాడు. నియంత్రణ లేనివాడు 'ప్రేయస్సు' కోరతాడు. తాత్కాలిక సుఖం, శాశ్వత దుఃఖం అనుభవిస్తాడు. అందుకే సుఖ దుఃఖాలన్నిటికీ ఆధారం మనస్సు. ఇది ఈ చరణంలోని భావం వెనుక ఉన్న నేపథ్యం టూకీగా.

తన్ కీ దౌలత్ ఢల్ తీ ఛాయా, మన్ కా ధన్ అన్ మోల్

తన్ కే కారణ్ మన్ కే ధన్ కో మత్ మాటీ మే రోందే

మన్ నీ కదర్ భులానేవాలా వీరాన్ జనం గవాయే॥

శ్రేయస్సు, ప్రేయస్సు భావనను, రెండు పక్షుల దృష్టాంతాన్ని సరళంగా వివరిస్తున్నాడీ చరణంలో. తనువుకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని మనస్సుకు ఇవ్వకపోవటం వల్ల శూన్య సదృశం అయి వ్యర్థమవుతుంది జన్మ. వ్యర్థంగా జన్మను కోల్పోతాడు. శరీరం మట్టిలో కలిసిపోతుంది. కానీ మనస్సు భౌతికేతరం. దానికి చావు లేదు. పుట్టినది చస్తుంది. జన్మలేనిదానికి మరణం కూడా లేదు. మనం అశాశ్వతమైన శరీరానికి ప్రాధాన్యం ఇచ్చి శాశ్వతమైన మనస్సును

విస్మరిస్తున్నామని గుర్తు చేస్తున్నాడు కవి. తనువు అనే ఐశ్వర్యం తరగిపోయే నీడలాంటిది. సూర్యుడు అస్తమిస్తే నీడపోతుంది. ధనం ఎంత ఉండీ లాభం లేదు. మనస్సు అనే ధనం అమూల్యమైనది. తనువు భ్రమలో పడి మనస్సును మట్టిపాలు చేయకూడదు. మనస్సు ప్రాధాన్యం విస్మరించినవాడు తన జన్మను వ్యర్ధంగా కోల్పోతాడు.

ఒక రకంగా చూస్తే ఈ ఒక్క పాటలో భారతీయ తాత్విక చింతనను, వేదాలు, ఉపనిషత్తులు, శంకరాచార్యుల భాష్యాలు సర్వం పొందుపరచి అతి సరళంగా, అందంగా అందించాడు సాహిర్. ఆనాటి కళాకారుల స్థాయి వేరు. వారి ప్రతిభా పాండిత్యాలు వేరు. వారి లక్ష్యం, ఉద్దేశ్యాలు వేరు. ఇలాంటి పాటలు పాడి, ఈ సత్యాన్ని నమ్మి ఆచరించే అమ్మాయి, తాగుబోతు భర్తను పొందితే, ఆ తాగుబోతు భర్త ఆమెను తాగమని ఒత్తిడి చేస్తే, అప్పుడు అందమైన తాత్విక గీతం రాశాడు సాహిర్.

ఛూలేనేదో నాజూక్ హోటోంకొ, కుఛ్ ఔర్ నహీ బస్ జామ్ హై యే

ఖుదరత్ నే జో హంకో బక్షా హై, వో సబ్ సే హసీన్ ఇనామ్ హై యే.

'భగవంతుడు మనకిచ్చిన అత్యంత అందమైన వరం, మద్యం. దాన్ని నీ పెదవులకూ తాకనీ' అంటున్నాడు హీరో.

ఇది శ్రేయస్సు, ప్రేయస్సు మార్గాల నడుమ చితికిన మనస్సు గాధ అన్నమాట. భార్య శ్రేయస్సు కోరుతున్నది. భర్త ప్రేయస్సులో పీకలదాకా మునిగి ఉన్నాడు. ఈ రెంటి నడుమ ఘర్షణ సినిమా కథ. ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే, బాల్యం నుంచి నీతి నియమాలు, విలువలతో పెరిగిన మహిళలు, ఆ నీతి నియమాలు, నైతిక విలువలను తమ సంసారంలో పాటిస్తారు. సంతానానికి అందజేస్తారు. వారి నుంచి ఆ విలువలు తరువాత తరానికి అందుతాయి. అలా ఉత్తమ విలువలు తరాలు వ్యాప్తి చెందుతాయి. సామాజిక సంక్షేమంలో తమ వంతు పాత్రను పోషిస్తాయి. ఎంతయినా వ్యక్తుల సమూహమే సమాజం కదా!

కానీ, అభ్యుదయం పేరిట, ఇజాల పేరిట, ఇంకా ఇతర ఆకర్షణీయమైన వాదాల, నినాదాల పేరిట ఈ నైతిక విలువలు, ఉత్తమ ఆలోచనలకు మహిళలను దూరం చేస్తే, వారి ద్వారా తరవాత తరానికి అందే విలువల పరంపరకు గండి పడుతుంది. దాంతో కుటుంబాల నైతిక విలువలు పతనమౌతాయి. తద్వారా సమాజం కూడా నైతిక విలువల పరంగా, ఉత్తమ ఆలోచనల పరంగా దిగజారుతుంది.

అధర్మది భావాతే కృష్ణప్ర దుష్యంతి కులస్త్రీయ:!

స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణ – సంకరాః ॥

భగవద్గీతలో అర్జునుడు యుద్ధం వద్దనేందుకు చూపిన కారణాల్లో ఇదొకటి. కుటుంబంలో నైతిక విలువలు నశించి అధర్మం ప్రబలితే, కుటుంబం, మహిళలు అధర్మ వర్తనులవుతారు. దానివల్ల స్త్రీలలో దౌష్ట్యం పెరుగుతుంది ఫలితంగా సమాజం భ్రష్టు పడుతుంది.

పురుషుడు అధర్మ మార్గం పట్టితే జరిగే నష్టం వ్యక్తిగతం, కానీ, స్త్రీ అధర్మ మార్గం పడితే నష్టం, కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికీ, తద్వారా దేశానికీ సంభవిస్తుంది అంటుంది భగవద్గీత. అందుకే మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది భారతీయ ధర్మం. కానీ, పలు దుష్ట సిద్ధాంతాలు, కుట్రలు నైతిక విలువల రాహిత్యం, కళ్ళేలు వదలిన రథ ప్రయాణమే అభివృద్ధి, అభ్యుదయం, ఆధునికం, విముక్తి, స్వేచ్ఛ అన్నట్టు నమ్మిస్తున్నాయి.

దీని ఫలితాలు కూడా ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం. మన సినిమాల్లోంచి, గుడికెళ్లే హీరోయిన్లు, భక్తిగీతాలు ఉదయమే పాడి, పూజచేసే మహిళలు అదృశ్యమైపోయారు. నిత్యజీవితంలో కూడా. అందుకే సమాజంలో విలువలు లేని, భయభక్తులు గౌరవాభిమానాలు లేని తరాలను చూస్తున్నాం. ఇటీవలి కాలంలో తండ్రికి సిగరెట్ అవసరమైతే కూతురి దగ్గర్నుంచి తెమ్మని భార్యను పురమాయించే కుటుంబాలను చూస్తున్నాం, సినిమాల్లో. తల్లీ తండ్రీ కలసి తాగటం, తాగి తండ్రిని బూతులు తిట్టే హీరోలు, ఇలా... ఎన్నెన్ని రకాలుగా దిగజారుడుతనాలున్నాయో అన్నన్ని దిగజారుడుతనాలు సినిమాల్లో చూస్తున్నాం. సమాజంలో అనుభవిస్తున్నాం. ఇదంతా అభ్యుదయం, ఆదర్శం, అభివృద్ధి అనుకోమంటే అనుకుంటున్నాం. కానీ 'మన్ కీ కదర్ భూల్ నే వాలే వీరాన్ జనమ్ గవాయే' అన్న సత్యాన్ని విస్మరిస్తున్నాం. 'ఔరమన్ దర్పణ్ కహలాయే' అన్న ఆలోచనను తృణీకరిస్తున్నాం. అలాంటి సమాజంలో ఇలాంటి పాటల ఆవశ్యకత మరింత పెరుగుతుంది. ఇలాంటి పాటలు వినాలి. వినిపించాలి. వివరించాలి. చర్చించాలి. తరువాత తరాలకయినా శ్రేయో మార్గం చూపే ప్రయత్నాలు చేయాలి.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story